క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మేయర్ దంపతులు



సీఎం రేవంత్‌రెడ్డితో మేయర్ పారిజాత దంపతులు

బడంగ్‌పేట్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు కలిసి రేవంత్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ దయాసాగర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఉన్నారు.

మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



మంత్రి ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ నగరంలోని ఆయన నివాసంలో కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం



రోగులను పరీక్షించి మందులు అందిస్తున్న వైద్యులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్ గ్రామంలో గురువారం జిమ్స్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనస్వి మాట్లాడుతూ.. 2023 ఆగస్టులో కొత్తూర్ గ్రామాన్ని తాము దత్తత తీసుకున్నామన్నారు. అందులో భాగంగా ప్రతీ గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులను పరీక్షించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. అవసరమైతే ఆస్పత్రికి పంపించి ఉచితంగా హోమియో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

చైర్‌పర్సన్ హేమలత



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత, కౌన్సిలర్ భావన

తుక్కుగూడ: మున్సిపాలిటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. గురువారం పుర కేంద్రంలోని 12వ వార్డులో సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ జపాల భావన, రాజమౌని రాజు, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒబేదుల్లా కొత్వాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ నిధులు, పథకాలు, వారి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయనతో చర్చించారు. అనంతరం నూతనంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన మహ్మద్ అలీఖాన్‌బాబర్‌కు ఒబేదుల్లా కొత్వాల్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాయక్, ఎండీ.ఇబ్రహీం, అలీంసకిబ్ పాల్గొన్నారు.

కానరాని నిబంధనలు!



టార్పాలిన్ లేకుండానే జాతీయ రహదారి మీదుగా డస్ట్ తరలిస్తున్న టిప్పర్

ఓవర్ లోడ్‌తో భారీ వాహనాలు రోడ్లపై తిరుగుతుండడంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని హడలిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అలాంటి వాహనాలను అదుపుచేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. లారీలు, టిప్పర్లలో డస్టు, కంకర, ఇసుక, మట్టి వంటి వాటిని నిబంధనలకు విరుద్ధంగా లారీ బాడీకిపైగా నింపుకొని, టార్పాలిన్లు తరలిస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. కంకర వంటి రాళ్లు వెనక వచ్చే వాహనాలపై పడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఓవర్‌లోడ్ టిప్పర్లతో ప్రమాదాలు

- వెనుక వచ్చే వారిపై కంకర, దుమ్ము
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్టు లారీల డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి. ప్రమాదాల నివారణకు సహకరించాలని తరచూ ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు డ్రైవర్లు కనీస నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్ల గుండా కంకర, డస్ట్(రాయిపొడి)ను తరలిస్తున్న భారీ టిప్పర్ల (లారీలు) కారణంగా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సామర్థ్యానికి మించి తరలింపు..

మండలంలోని ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ గ్రామాల శివార్లలో స్టోన్ క్రషర్లు కొనసాగుతున్నాయి. నిత్యం వ్యాపారులు తమకు వచ్చే ఆర్డర్లను ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, ఇన్ముల్‌నర్వ–షాద్‌నగర్ రోడ్ల మీదుగా జాతీయ రహదారుల గుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డ్రైవర్లు వాటి యజమానుల ఆదేశాల మేరకు టిప్పర్లలో సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్నారు. ఈ సమయంలో లారీల్లో నుంచి కంకర, డస్ట్ రోడ్డుపై కింద పడకుండా టార్పాలిన్లు చుట్టడం లేదు. కొందరు డ్రైవర్లు టిప్పర్లకు టార్పాలిన్లు కడుతున్నప్పటికీ లోడ్ అధికంగా ఉండడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద కంకర రాళ్లు కిందపడుతున్నాయి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు వెడల్పుగా ఉండడంతో టిప్పర్ల డ్రైవర్లు వేగంగా వాహనాలను నడిపే క్రమంలో కంకర రాళ్లు వెనకాల వచ్చే వాహనాలకు తగిలి అద్దాలు పగిలిన సందర్భాలు సైతం ఉన్నాయి. దీనికి తోడు టార్పాలిన్ కట్టకపోవడంతో గాలికి డస్ట్(రాయిపొడి) ఎగిరి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

కానరాని అధికారుల తనిఖీలు..

ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, షాద్‌నగర్ రోడ్ల గుండా నిత్యం స్టోన్ క్రషర్లకు సంబంధించిన భారీ వాహనాలు పదుల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కొన్ని వాహనాల్లో సామర్థ్యానికి మించి వస్తువులు, కంకరను తరలిస్తున్నారు. మరికొన్ని వాహనాలు కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టడం లేదు. వీటి కారణంగా రోడ్లపై పడుతున్న కంకర, డస్ట్‌తో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్న భారీ టిప్పర్లపై సంబంధిత శాఖల అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు గుండా కంకర, డస్ట్‌ను తరలిస్తున్న టిప్పర్ల నుంచి రోడ్డుపై కంకర, డస్ట్ కింద పడుతోంది. వేగంగా వెళ్లే సమయాల్లో కంకర టిప్పర్ల వెనకాల వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలపై పడుతోంది. దీంతో కార్ల అద్దాలు పగలడంతో పాటు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి టిప్పర్ల డ్రైవర్లు టార్పాలిన్ కట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మహేశ్, ఇన్ముల్‌నర్వ

చర్యలు తీసుకుంటాం



కంకర, డస్ట్‌తో పాటు ఇతర వస్తువులు తరలించే భారీ వాహనాల డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టాలి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డులో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని లారీలపై చర్యలు తీసుకుంటాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



కేఎల్లార్‌తో నాయకులు

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కేఎల్లార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మంత్రి బాల్‌రాజ్, మంత్రి అంజయ్య, మదిలపురం మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంధ్యానాయక్, నారాయణ, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' పెంపుపై హర్షం

చేవెళ్ల: దేశంలోని రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పెంచినందుకు ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ముందుచూపుతో రైతుల కోసం నూతన సంవత్సరంలో సంతోషాన్ని ఇచ్చే విధంగా పీఎం కిసాన్‌ను 6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. ఇది నిజంగా రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులకు ఇది వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు



కందుకూరులో సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కందుకూరు: కల్వకుర్తి నియోజకవర్గం వైపు వెళ్తూ మార్గమధ్యలో కందుకూరులో ఆగిన ఎమ్మెల్యే సబితారెడ్డితో పాటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జి.పరంజ్యోతి, జంగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ పార్టీ 18వ వార్డు ఇన్‌చార్జి గుండు నర్సింగ్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలన్నారు. స్థానికంగా శ్మశాన వాటిక కూడా లేకపోవడంతో అంత్యక్రియల నిర్వహణకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కాలనీలో పేదలు ఉన్నందున వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో బాలకృష్ణ, యువరాజ్ ఉన్నారు.

జక్కుల కుంట ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు



ధ్వంసమైన జక్కుల కుంట

తుక్కుగూడ: జిల్లాలో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్టర్లు చెరువులు, కుంటల భూములను కూడా వదలడం లేదు. తాజాగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ రెవెన్యూ పరిధిలోని జక్కుల కుంటను కొంతమంది రియల్టర్లు ధ్వంసం చేశారు. కుంట కట్టను ధ్వంసం చేసి ఈ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం. కుంట ధ్వంసం పట్ల స్థానికులు గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులకు, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జక్కుల కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు సకాలంలో రుణాలు

పీఏసీఎస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి

మొయినాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందిస్తున్నామని సురంగల్, మొయినాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ సేవలు ప్రతీ రైతుకు అందాలన్నారు. అవసరమైన రైతులందరికీ రుణా లు ఇవ్వాలని, పీఏసీఎస్‌పై రైతులకు అవగాహన పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, అనిత, భూపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్య, గంగమ్మ, జగన్‌మోహన్‌రెడ్డి, సీతఊ మనోహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముళ్ల పూజ

మొయినాబాద్: స్వామి శరణం.. అయ్యప్ప శరణం.. అంటూ అప్పోజీగూడ గ్రామ వీధులు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. మండల పరిధిలోని అప్పోజీగూడలో గురువారం కేశవ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప ఇరుముడి పూజ ఘనంగా జరిగింది. ఈ పూజల్లో భాగంగా అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, పడిపూజ చేపట్టి పడిని వెలిగించారు. ఇరుముడి పూజ అనంతరం మాలదారులు ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అయ్యప్ప భక్తులకు, ప్రజలకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మహేందర్, సన్నిధానం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ శివమారుతీ గీతా అయ్యప్పస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున దేవాలయంలో స్వామివారికి పాలాభిషేకం, పూజలు చేశారు. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణను కలిసిన నేతలు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయభాస్కర్, మోహన్‌సింగ్, నర్సింహాయాదవ్, శివారెడ్డి, శ్యాంసుందర్, సుధాకర్, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, కృష్ణ, ఇంద్రసేనారెడ్డి, బాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివంహిల్స్, వీరభద్రనగర్, సీతారామాపురం, గణేశ్‌నగర్, విజయానగర్, స్వాతి రెసిడెన్సీ, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ శ్రీనివాసకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ కమలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు. 11కేవీ నేతాజీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ హుడాకాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ ఆంధ్రకేసరినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ సౌత్ ఎండ్‌పార్కు, ఎల్బీనగర్, ఆటోనగర్, ఆలిండియా రేడియో, సిరీస్ ఫీడర్, మన్సూరాబాద్, హైకోర్టుకాలనీ, హుడాసాయినగర్, ఇందిరానగర్, డీర్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయబడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధిలోని మందమల్లమ్మ ఎక్స్ రోడ్డు–టీకేఆర్ కళాశాల కమాన్, శక్తినగర్, అంబేడ్కర్‌నగర్, గాయత్రినగర్, న్యూ గాయత్రినగర్, ఓల్డ్ గాయత్రినగర్ కాలనీ, డీఆర్‌ఆర్ హోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న లక్ష్మారెడ్డి, తదితరులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు చీరలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే టెండర్లు పిలిచి మహిళా భవన్ పనులను ప్రారంభిస్తామని, రోడ్ నెం–4, 5లో డ్రైనేజీ పనులు పూర్తిచేయిస్తానని ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి హామీనిచ్చా రు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, శంకర్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు దయాకర్, ఆంజనేయులు, నరేశ్, సూర్యనారాయణ, ఆచార్యులు, కృష్ణమూర్తి, మహిళా మండలి అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సరిత, కోశాధికారి నిత్య, సంధ్య, వాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి



బూత్ అధ్యక్షుడిగా శ్రీనుకు నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, రాము

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో 206 బూత్ అధ్యక్షుడిగా శ్రీనును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీకి యువతే కీలకమని, యువకులందరూ ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పార్టీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గురుస్వామి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతీ నిరుపేదకు ఇల్లు ఇస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పెద్దఎల్కిచర్లలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తుందన్నారు. సర్వేలో పేదలు ఎవరు తప్పిపోకుండా చూడాలన్నారు. దివ్యాంగులు, వితంతువులకు తప్పనిసరిగా లబ్ధిచేకూరేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొందుర్గు మండలంలోని ఆగిర్యాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ఆగిర్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు సంయమనం పాటించాలని, ఐకమత్యంతో క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, వెంకటనర్సింహారెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, గోపాల్, యాదయ్య పాల్గొన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి

షాద్‌నగర్‌రూరల్: పద్మశాలీలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని పద్మశాలి భవనంలో సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం అప్ప, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, రాయికల్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు కోట జనార్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం

- నిందితులను వెంటనే శిక్షించాలి
- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య



నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: తుక్కుగూడలో హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య కూడలిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించిన విద్యార్థి పాఠాలను సరిగా అప్పజెప్పకపోవడంతో హెచ్‌ఎం రాములు అందరు విద్యార్థుల మాదిరిగానే మందలించారన్నారు. ఈ విషయాన్ని కొందరు అయ్యప్ప స్వాములు వివాదస్పదం చేస్తూ అయ్యప్పలను అవమానించినట్లుగా చిత్రీకరించి హెచ్‌ఎంను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేయడం సరికాదన్నారు. రాములుపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, మండల ప్రధాన క్యాదర్శి సత్యం, నాయకులు నర్సింలు, కృష్ణ, నర్సింలు, లక్ష్మిదేవమ్మ, సమత, జోతిర్మయి, అరుణ, శేఖర్‌గౌడ్, సురేందర్, శివరాములు, రవికుమార్, రాములు, మహేశ్, డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.